సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 13 । మార్చి । 2025



గురు సన్నిధి.. ఆధ్యాత్మిక పెన్నిధి

హిందూ, ముస్లిం సమైక్యతకు ప్రతీకగా ఓ పవిత్ర దర్శనీయ స్థలంగా నేడు నీలకంఠ్రావుపేట దర్గా. ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు॥ (సా॥)	సహర్ శుక్ర॥ (ఉ॥)
రాయచోటి :	6.29	5.05
రాజంపేట :	6.28	5.11
పీలేరు :	6.29	5.02
మదనపల్లె :	6.31	5.05

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 94 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

అభివృద్ధి పనుల పరిశీలన

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్‌పై అటవీశాఖ ప్రాంగణంలో చేపట్టిన సుందరీకరణ పనులను బుధవారం రేంజర్ జయప్రసాదరావు పరిశీలించారు. సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్‌తో కలిసి ఇక్కడ అతిథి గృహాల పనులు, ప్రాంగణంలో చేపట్టిన పనులను తనిఖీ చేశారు. వీటి పనులు సత్వరమే పూర్తి చేయించాలని కోరారు.

19 మందికి డీటీలుగా పదోన్నతి

పెద్దతిప్పసముద్రం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రెవెన్యూ శాఖలో ఆర్‌ఐ, సీనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న 19 మంది అధికారులు డిప్యూటీ తహసీల్దార్‌లు(డీటీ)గా పదోన్నతులు పొందారు. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లాలో నలుగురు అధికారులు డీటీలుగా పదోన్నతులు పొందారు. పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు తహసీల్దార్ కార్యాలయాల్లో ఆర్‌ఐలుగా పని చేస్తున్న బాలాజీ, అనీషా, రాయచోటి డీఎస్వో , కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న చాణక్య, కమలాకర్‌లు డీటీలుగా పదోన్నతులు పొందారు. ఈ మేరకు ఆయా కార్యాలయాలకు చిత్తూరు జిల్లా కలెక్టర్, నోడల్ అధికారి సుమిత్ర కుమార్ ఉత్తర్వులు పంపినట్లు అధికారులు పేర్కొన్నారు.

పోటాపోటీగా వేలం పాట

కురబలకోట: జిల్లాలో పేరుగాంచిన మండలంలోని అంగళ్లు టమాటా మార్కెట్, గొర్రెల సంత గేటు వసూలు వేలం పాటలు బుధవారం పోటాపోటీగా సాగాయి. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద డీఎల్‌పీఓ నాగరాజు ఆధ్వర్యంలో సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వేలం పాటల్లో అంగళ్లు గొర్రెల వారపు సంత రూ. 52.10 లక్షలకు పి. సత్తార్ ఖాన్ పాడుకున్నారు. అంగళ్లు టమాటా మార్కెట్ రూ. 45.40 లక్షలకు పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి దక్కించుకున్నారు. అంగళ్లు వారపు సంత రూ. 7.70 లక్షలకు ఉప్పతి శ్రీనివాసులు మునుపటి గుత్త దారు కైవసం చేసుకున్నారు. నిరుటి కన్నా ఈసారి రూ. 20 లక్షలు అధికంగా పలికినట్లు గ్రామ కార్యదర్శి టి. ఉదయ్ కుమార్ తెలిపారు. సంత గేటు వేలం పాట ద్వారా అంగళ్లు పంచాయతీకి రూ.1.05 కోట్లు ఆదాయం లభించినట్లయ్యింది.

మల్లికార్జునస్వామికి రూ.12 లక్షల ఆదాయం

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిచారు. మహాశివరాత్రి ఉత్సవాలకు మల్లయ్యకొండకు వచ్చిన భక్తులు హుండీ ద్వారా చెల్లించిన కానుకలను బుధవారం ఆలయం ఇన్స్‌పెక్టర్ శశికుమార్,ఈఓ మునిరాజ, ఎస్.ఐ లోకేష్‌రెడ్డి సమక్షంలో లెక్కించారు. రూ.12, 30,310 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. ఈ మొత్తాన్ని స్థానిక ఇండియన్ బ్యాంకులో డిపాజిట్ చేశామన్నారు. కార్యక్రమంలో కొండ కిట్ట, చంద్రశేఖర్, సిద్దమ్మ రెడ్డప్పరెడ్డి, రాజారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు చేసుకోండి

రామాపురం: రైతులు సాగు చేసిన కంది పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చిట్లూరు గ్రామంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాయచోటిలోని మార్కెట్‌యార్డులో కంది క్వింటాకు రూ.7,550లు కనీస మద్దతు ధర ఉందని రైతులకు సూచించారు.పీఎం కిసాన్ రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని, అప్పుడే ప్రభుత్వం పథకాలకు అర్హులవుతారని చెప్పారు. రబీ సీజన్‌లో పంట నమోదు చేసిన రైతుల జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ఉంచామన్నారు.అభ్యంతరాలు ఉంటే ఈనెల 19వ తేదిలోగా రైతు సేవా సిబ్బందికి తెలియజేలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, ఏఈఓ ప్రపంజం, వీహెచ్‌ఏ యాసిన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

రాయచోటి: ఈనెల 17వ తేది నుంచి 31వ తేది వరకు జిల్లాలో నిర్వహించే పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.బుధవారం విజయవాడలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి పదోతరగతి పరీక్షల నిర్వహణ, స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర సానుకూల ప్రజా అవగాహన, పి-4 మోడల్ సర్వే అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వీసీకి రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జేసీ ఆదర్శ రాజేంద్రన్‌లు పాల్గొన్నారు.వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికలో భాగంగా ప్రతి ఇంటికి అభివృద్ధి.. ప్రతి జీవితానికి ప్రగతి సాధనకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం పి-4 సర్వేకు సంబంధించిన ప్రచార పత్రాలను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. వీసీలో డిఆర్‌ఓ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పిడికిలి బిగించి.. పోరాటం సాగించి..

- ఉపాధితోపాటు భృతి ఇవ్వాలని డిమాండ్
- వైఎస్సార్ సీపీ శ్రేణులు, నేతలు, కార్యకర్తలతో కిక్కిరిసిన కలెక్టరేట్
- ప్రభుత్వ వంచనపై గర్జించిన నిరుద్యోగులు, విద్యార్థులు
- జాతీయ రహదారి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ

సాక్షి రాయచోటి/రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణి, మోసంపై ప్రజాగ్రహం పెల్లుబుకింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడులు, దౌర్జన్యాలతో భయపెడుతున్న వైనంపై జనం తిరగబడుతున్నారు. అధికారం రాకముందు ఎన్నెన్నో హామీలు గుప్పించి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం... నియంతృత్వధోరణితో అమలు చేయకపోవడం లాంటి చర్యలపై అడుగడుగునా ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు. నిరుద్యోగులకు రూ. 3 వేలు భృతి వెంటనే చెల్లించాలంటూ కదం తొక్కారు. ఉపాధి మార్గం చూపించాలని..మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయవద్దంటూ పార్టీ శ్రేణులు భారీగా తరలిరావడంతో బుధవారం కలెక్టరేట్ దద్దరిల్లింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా దిక్కులు పిక్కటిల్లేలా చేస్తున్న నినాదాలతో అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని కలెక్టరేట్ హోరెత్తింది. కలెక్టరేట్ వద్ద జై జగన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్ధిల్లాలి, ఇచ్చిన హామిలన్నీ ప్రభుత్వం దిగి వచ్చి వెంటనే నెరవేర్చాలంటూ నినదించాయి.

కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్ ఆనుకుని ఉన్న జాతీయ రహదారి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ విభాగం ప్రతినిధులు, ఇతర ప్రజా ప్రతినిధులు, శ్రేణులు ర్యాలీగా కదం తొక్కాయి. రహదారి వద్ద నుంచి పార్టీ శ్రేణులతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, రైల్వేకోడూరు, పీలేరు మాజీ ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లె పార్టీ ఇన్‌చార్జి నిసార్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో తరలివచ్చిన కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. దోపిడీ రాజ్యం–దొంగ ప్రభుత్వమంటూ నినాదాలతో హోరెత్తించారు. మెయిన్‌రోడ్డు నుంచి కలెక్టరేట్ భవనం వరకు ర్యాలీ నిర్వహించినంతరం కొద్దిసేపు మెయిన్ గేటు వద్ద జగనన్నినాదాలతో హోరెత్తించారు.

డీఆర్వోకు వినతి

ర్యాలీగా వచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కలెక్టరేట్‌లో ఉన్న డీఆర్వో మధుసూదన్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం వెంటనే దిగి వచ్చి డిమాండ్ నెరవేర్చాలని కోరారు. నేతలు, కార్యకర్తలు, నాయకులు తరలి రావడంతో కలెక్టరేట్ ఆవరణమంతా జనంతో నిండిపోయింది.



కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, నిరుద్యోగులు, విద్యార్థులు



ర్యాలీగా కలెక్టరేట్‌కు వస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎ. అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు తదితరులు



డీఆర్వో మధుసూదన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అన్ని వర్గాలను మోసం చేశారు



అన్ని వర్గాలను అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం మోసం చేస్తోంది. ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ఇస్తామని చెప్పి ఈ ఏడాది పంగనామం పెట్టింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి నిధులు ఇవ్వకపోవటంతో వారంతా అప్పుల పాలు అవుతున్నా రు. ఉద్యోగం ఇవ్వకుంటే నిరుద్యోగభృతి అంటూ హామీలిచ్చి, ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడం దారుణం.

–ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే

జాబ్ క్యాలెండర్ ఊసే లేదు



జనవరిలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఆర్భాటంగా చేసిన ప్రకటన నేటికీ అమలు కాలేదు. నిరుద్యోగభృతి మరచిపోయారు. నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసింది. నిద్ర మత్తులో ఉన్న ఈ ప్రభుత్వానికి పోరుబాటతో మేల్కొలుపుతాం. –జి.కిషోర్‌దాస్, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా విద్యార్థి సంఘం అధ్యక్షుడు

నిరుద్యోగభృతి ఎప్పుడో... ?



సూపర్ సిక్స్‌లో భాగంగా నిరుద్యోగభృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామన్న హామీ ఇచ్చారు. అమలు చేయడం లేదు. ఉద్యోగం లేక ఇబ్బందులు పడుతున్న యువత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం నిరుద్యోగభృతి అందించి నిరుద్యోగులను ఆదుకోవాలి. ఆ దిశగా ముందడుగు వేయాలి. – శివప్రసాద్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు

కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యం



కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యం. వలంటీర్లను ప్రభు త్వం రోడ్డు పాలు చేసింది. లక్షలాది ఉద్యోగాలిస్తామని చెప్పి యువతను మోసం చేసింది. వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని నమ్మబలికి నట్టేట ముంచింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి, యువత భవిత కోసం నిరంతరం పోరాటం చేస్తాం. –పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్యే, తంబళ్లపల్లె

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి. ఎన్నికల ముందు చెప్పిన విధంగా నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగభృతి చెల్లించాలి. జాబ్‌క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేయాలి. కొత్త మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తూ పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయరాదు.నిరుద్యోగ యువతకు ఇప్పటి వరకు బాకీపడిన రూ.30 వేల భృతిని తక్షణం చెల్లించాలి. – జి.శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజలకు అండగా ఉంటాం



ప్రధాన ప్రతిపక్ష పార్టీగా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని యువతకు, విద్యార్థులకు అండగా నిలిచి కూటమి ప్రభుత్వం విధానాలపై పోరాడేందుకు ముందుంటుంది. యువత పోరులో విద్యార్థి, యువజన సంఘాలతో వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో శాంతియుతంగా నిర్వహించిన నిరసన కార్యక్రమాలతో కూటమి ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టింది.ఇప్పటికైనా ప్రభుత్వం హామీలను అమలు చేయాలి. – చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పీలేరు

హామీలిచ్చి మోసం చేయడం బాబు నైజం



ఎన్నికల ముందు ఎన్నో హామీలివ్వడం..వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబునాయుడు నైజం. ఆర్థిక సమస్యలు అంటూ సూపర్ సిక్స్ హామీలను ఎగ్గొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది సరికాదు. హామీలు అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు పోరాడతాం. కూటమి ప్రభుత్వం తప్పొప్పులను ప్రశ్నిస్తామని చెప్పే పవన్‌కళ్యాణ్ ఇప్పుడు ఎక్కడికి పోయారు. – కొరముట్ల శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే, రైల్వేకోడూరు

హామీల అమలులో చిత్తశుద్ధి లేదు



హామీల అమలులో కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. 2014 ఎన్నికల్లోనూ నిరుద్యోగభృతి అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేశారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటివరకూ నిరుద్యోగభృతి ప్రస్తావన లేకపోవడం దారుణం. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తాం. –నిస్సార్‌అహమ్మద్, మదనపల్లె వైఎస్‌ఆర్‌సీపీ ఇన్‌చార్జి

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

రాయచోటి/రాయచోటి అర్బన్: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. బుధవారం ఉదయం జిల్లా కేంద్రం రాయచోటితో పాటు జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాల పార్టీ కార్యాలయాల ఆవరణాలలో పార్టీ నాయకులు, అభిమానుల నడుమ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజవర్గ కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల వద్ద ఆ పార్టీ నాయకులు పార్టీ జెండాలను ఆవిష్కరించి, అభిమానుల కోలహాల మధ్య కేకులను కట్ చేశారు. వైఎస్సార్ ఆశయాల సాధనే లక్ష్యంగా ఆవిర్భవించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నాటి నుంచి నేటి వరకు తమ భుజస్కందాలపై మోస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ శ్రేణులు ఒకరికి ఒకరు పార్టీ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రెపరెపలాడిన పార్టీ జెండా..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 15 ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకొని జిల్లాలోని అన్ని నియోజకవర్గ కార్యాలయ ఆవరణాల్లో పార్టీ జెండా రెపరెపలాడింది. రాయచోటిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొరుముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డిలు కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ప్రజాక్షేత్రంలో పురుడుపోసుకున్న పార్టీ వైఎస్సార్‌సీపీ అని అన్నారు. రాయచోటి నియోజవర్గ పార్టీ కా ర్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మున్సిప ల్ చైర్మన్ ఫయాజ్‌బాషాలతో కలిసి జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, మాజీ ఎంపిపిలు పోలు సుబ్బారెడ్డి, అంబాబత్తిన రెడ్డెయ్య, ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, నేతలు ఆవుల వేణుగోపాల్‌రెడ్డి, యధుభూషణ్‌రెడ్డి, పడమటికోన బాబురెడ్డి, జడ్పిటిసిలు ఎం.వెంకటరమణ, వెంకటేశ్వర రెడ్డి, పల్లపు రమేష్, రవిశంకర్‌రెడ్డి, కర్ణపు విశ్వనాథ రెడ్డి, కొలిమి హారూన్‌బాషా, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.



జిల్లా పార్టీ కార్యాలయ ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

- రాజంపేటలోని పార్టీ భవన్‌లో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులు రెడ్డితో కలిసి ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి జెండాను ఆవిష్కరించారు.
- కోడూరులోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు స్థానిక నాయకులతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరణ చేసి వేడుకలు నిర్వహించారు.
- తంబళ్ళపల్లి పార్టీ కార్యాలయం లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందుగా పట్టణ కేంద్రంలోని వైఎస్‌ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూల దండలతో సత్కరించారు . ఈ సందర్భంగా దివంగత నేతకు నివాళులర్పించారు.
- పీలేరు నియోజకవర్గ పరిధిలోని వాల్మీకిపురం లో ఉన్న పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు.
- మదనపల్లెలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజవర్గ పార్టీ ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ మనుజా రెడ్డిలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు.నియోజవర్గ పరిధిలోని రామసముద్రం మండల కేంద్రంలో స్థానిక నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలను నిర్వహించారు.

కడప-రేణిగుంట నేషనల్‌హైవే పనులు త్వరలో ప్రారంభం

- కేంద్రమంత్రి హామీ ఇచ్చారు
- ఎంపీ మేడా రఘునాథరెడ్డి



రాజంపేట: ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోని కడప-రేణిగుంట నేషనల్‌హైవే (716) పనులు త్వరలోనే ప్రారంభిస్తామని కేంద్ర రోడ్డు రవాణా, హైవే మంత్రి నితిన్ జైరాం గడ్కారీ హామీ ఇచ్చారని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి బుధవారం ఇక్కడి విలేకర్లకు తెలిపారు. రాజ్యసభలో కడప-రేణిగుంట జాతీయ రహదారి మంజూరై రెండేళ్లు అయిందని ప్రశ్నోత్తరాల సమయంలో అంశాన్ని ప్రస్తావించామన్నారు .ఇందుకు కేంద్రమంత్రి సమాధానంలో భాగంగా త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారన్నారు. ఈ నేషనల్‌హైవే నిర్మాణానికి సంబంధించి మొదటి దశ అటవీశాఖ నుంచి క్లియరెన్స్ వచ్చిందన్నారు. వన్యప్రాణులు ఎకోసెన్సిటివ్ జోన్ నుంచి అనుమతులు రావాల్సి ఉంటుందన్నారు. వైల్డ్‌లైఫ్ అనుమతులు వచ్చాక ఎన్‌హెచ్ నిర్మాణానికి మార్గం సుగమవుతుందన్నారు. రెండు ప్యాకేజీల్లో రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. కడప-చిన్నఓరంపాడు, చిన్నఓరంపాడు-కడపల వారీగా నాలుగురోడ్ల నిర్మాణం కొనసాగుతుందన్నారు. త్వరగా వైల్డ్‌లైఫ్ అనుమతులు వచ్చేలా కేంద్రం త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు.

బహిరంగవేలం: రూ.21.93 లక్షల ఆదాయం

కలికిరి: కలికిరి గ్రామ పంచాయతీకి సంబంధించి వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, మాంసం దుకాణాలకు 2025–26 ఆర్థికె సంవత్సరానికి బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. దీనివల్ల పంచాయతీకి గరిష్టంగా రూ. 21.93లక్షల ఆదాయం సమకూరినట్లు డీఎల్‌పీఓ నాగరాజు తెలిపారు. వారపుసంతకు రూ.16లక్షలు, దినసరి కూరగాయల మార్కెట్‌కు రూ.3లక్షలు, ప్రైవేటు బస్టాండ్‌కు సంబంధించి రూ.2.03 లక్షలు, మాంసం దుకాణాలకు రూ.90వేలు, మొత్తం 21.93 లక్షలు ఆదాయం రాగా గత ఏడాది 15.23 లక్షలు మాత్రమే ఆదాయం వచ్చింది. సర్పంచ్ ఎల్లయ్య, ఈఓ అశోక్, యోగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తేడా వస్తే 'రంగుపడుద్ది'

జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్య హోలీ



మదనపల్లె సిటీ/రాజంపేటటౌన్: హోలీ..అందరిలో ఉత్సాహం నింపుతుంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ రంగుల్లో మునిగి తేలుతుంటారు. నాటితరం జరుపుకొనే వేడుకలకు నేటి యువత చేసుకుంటున్న సంబరాలకు పోలిక ఉండటం లేదు. గతంలో సహజ రంగులతో హుందాగా జరుపుకుంటే.. నేడు రసాయనాలతో తయారు చేసిన రంగులు పూసుకుంటున్నారు. ప్రస్తుతం వాడుతున్న రంగుల్లో ప్రమాదకరమైన క్రోమియం, అల్యూమినియం, మెర్క్యురీ ఆక్సైడ్‌లు కలుస్తున్నాయి. ఇలాంటి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే 'రంగుపడుద్ది'అని హెచ్చరిస్తున్నారు నిపుణులు.

ఇలా చేద్దాం

పలు రకాల పూలు, పండ్లతో ఇళ్లల్లోనే సహజసిద్ధమైన రంగులు తయారు చేసుకోవచ్చు. వీటితో చర్మానికి మేలు కలగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారు. ఎర్ర గులాబీ, మందారం పూలు, ఎర్రచందనం, టమటా గుజ్జు, క్యారెట్, బీట్‌రూట్‌లతో ఎరుపు రంగు తయారవుతుంది. పసుపు పొడి, తంగేడు,బంతి, చామంతి,తుమ్మపూలతో పసుపురంగు ద్రావకం సిద్ధమవుతుంది. వేసవిలో విరివిగా లభించే మోదుగ పూలతో కాషాయరంగు ద్రావణం తయారు చేసుకోవచ్చు. ఎండిన గోరింటాకు పొడి లేదా పచ్చి గోరింటాకు, పాలకూర, పుదీనా, కొత్తిమీర వంటి ఆకుకూరలను మెత్తగా రుబ్బి నీరు కలిపితే ఆకుపచ్చ రంగు తయారు చేసుకోవచ్చు.



హోలీ ఆడేందుకు ఉపయోగించే రంగులు

ఇవీ సూచనలు

హోలీ ఆడటానికి ముందు శరీరానికి మాయిశ్చరైజర్‌ని, తలకు నూనెను రాసుకోవాలి. దీనివల్ల రంగులు శరీరంలోకి ఇంకవు. ముఖంపై పడిన రంగులను శుభ్రం చేసుకోవడానికి సబ్బు కన్నా డ్రెస్సింగ్ మిల్క్ ఉత్తమమైనది. చాలా మంది హోలీ ఆడే సమయంలో రంగులలో ఆయిల్స్ కలుపుతారు. ఈకారణంగా రంగులను శుభ్రం చేసుకోవడానికి కష్టపడాల్సి వస్తుంది. రంగుల్లో ఎలాంటి నూనెలు, నీళ్ల కలపకుండా చల్లుకుంటే మంచిది.

కళ్లల్లో పడితే ప్రమాదం



మార్కెట్‌లో లభిస్తున్న రంగుల్లో రసాయనాలు కలుస్తున్నాయి. ఇవి కళ్లల్లో పడితే కంటి చూపునకే ప్రమాదం. కళ్లకు రక్షణగా అద్దాలు ధరించాలి. కళ్లల్లో రంగుపడితే వెంటనే నీటితో కడిగి వైద్యున్ని సంప్రదించాలి. –వెంకటరామయ్య, వైద్యులు

చిన్నపిల్లలను దూరంగా ఉంచాలి



హోలీ అంటే చిన్నపిల్లల్లో ఉత్సాహం ఉరకలేస్తుంది. రంగులు ఎలా చల్లుకోవాలో వారికి తెలియదు. నోరు, ముక్కుల్లోకిపోయే అవకాశం ఉంది. దీంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. పిల్లలను హోలీకి దూరంగా ఉంచాలి. – వీరయ్య, వైద్యులు, రాజంపేట

క్లుప్తంగా

కువైట్‌లో కోడూరు వాసి ఆత్మహత్య


కొల్లా శ్రీనివాసులు (ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణం రంగనాయకులపేటకు కొల్లా శ్రీనివాసులు (38) కువైట్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా.. కష్టాలు, అప్పుల బాధలు తట్టుకోలేక సూరపురాజుపల్లిలో ఉన్న సొంత ఇంటిని అమ్మేసి భార్యా భర్తలు ఇరువురూ జీవనోపాధికి కువైట్‌కు వెళ్లారు. అయినప్పటికీ అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య అన్నపూర్ణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబాన్ని ఆదుకోవాల్సిన వ్యక్తి మృతి చెందడంతో కుటుంబమంతా రోడ్డున పడింది.

రైతు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. సింగన్నగారిపల్లెకు చెందిన రైతు ఆంజనేయులు(45) కుటుంబ సమస్యలతో ఇంట్లో గొడవపడి పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కారు ఢీకొని పాదయాత్రికుడి దుర్మరణం


మృతి చెందిన పాదయాత్రికుడు

పుల్లంపేట : తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన బుధవారం పుల్లంపేట మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వైఎస్సార్ జిల్లా వీరపునాయునిపల్లె మండలం అనిమెల గ్రామానికి చెందిన కొందరు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. రెడ్డిపల్లి చెరువుకట్ట వద్దకు రాగానే రైల్వేకోడూరుకు చెందిన కారు పాదయాత్రికునిపై దూసుకు వచ్చింది. ఈ ప్రమాదంలో చాట్ల కొండయ్య (42) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మల్లేల వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మోహన్ కుమార్ గౌడ్ తెలిపారు.

మద్యం విక్రయంపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : స్థానిక బి.కొత్తకోట రోడ్డులోని ఓ రేకుల షెడ్డులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిహర ప్రసాద్ తెలిపారు. బుధవారం షెడ్డులో ఎనిమిది క్వార్టర్ బాటిళ్లతో పాటు పట్టుబడిన గూని రమేష్ (31) అనే నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు లారీలు ఢీ

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లె జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ఎదురెదురుగా రెండు లారీలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో లారీల ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఆయిల్ ట్యాంకర్ లారీలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ్ జనక్ పటేల్ చిక్కుకు పోయాడు. స్టీరింగ్ సందులో ఇరుక్కుపోవడంతో బయటకు రాలేకపోయాడు. ఎస్‌ఐ మహేష్ నాయుడు ప్రమాద స్థలానికి చేరుకొని జేసీబీ సాయంతో లారీలను తొలగించి లారీలో ఇరుక్కుపోయిన వ్యక్తిని బయటకు తీసి 108 వాహనంలో తిరుపతికి తరలించారు. రెండు లారీలు వేగంగా రావడంతో మలుపు వద్ద అదుపు చేయలేక ఢీ కొన్నాయి. రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీలతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు ప్రమాద స్థలానికి చేరుకొని వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

గురు సన్నిధి.. ఆధ్యాత్మిక పెన్నిధి

- హిందూ, ముస్లిం సమైక్యతకు ప్రతీక నీలకంఠ్రావుపేట దర్గా
- నేటి నుంచి ఉరుసు ప్రారంభం


సద్గురు హజరత్ దర్బార్ వలీఅలీషా వలీ, రహంతుల్లా అలైహిబాబా, జలీల్ మస్తాన్‌వలీ సమాధులు


సద్గురు దర్గా స్వామీజీల మహా సమాధి

రామాపురం : ఆరు దశాబ్దాల క్రితం నిర్జీవంగా ఉండి సమాధుల చుట్టూ గోడలు ఉండే ప్రదేశం నేడు ఎందరో భక్తులకు మానసిక ఉల్లాసం కలిగిస్తూ, వారి కోర్కెలు తీర్చే ఆలయంగా మారింది నీలకంఠ్రావుపేట దర్గా.

ఆరు దశాబ్దాల క్రితం అదో నిర్జన ప్రదేశం. అందులో రెండు సమాధులు, చుట్టూ గోడలు, సాయంత్రం వేళల్లో ఫకీరులు పక్క గ్రామమైన నీలకంఠ్రావుపేట, చుట్టు పక్కల గ్రామాల్లో భిక్షమడిగి తెచ్చుకుని అక్కడే తిని, అక్కడే బస చేస్తుండేవారు. దర్గా అని పిలువబడే ఇక్కడికి భక్తులు వచ్చి తమ మొక్కులు తీర్చుకుని వెళుతుండేవారు. ఈ దర్గా అన్నమయ్య జిల్లా రామాపురం మండలం నీలకంఠ్రావుపేట సమీపంలో దక్షిణ దిశగా ఒక కిలోమీటరు దూరంలో ఉంది. ఏటా ఘనంగా దర్గా ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.

దర్గా సంక్షిప్త చరిత్ర..

హిందూ, ముస్లిం సమైక్యతకు ప్రతీకగా ఓ పవిత్ర దర్శనీయ స్థలంగా నేడు ఈ దర్గా వెలుగొందుతోంది. కడప –చిత్తూరు ప్రధాన జాతీయ రహదారికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో వెలసిన ఈ దర్గాలో ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున ఎంతో వైభవంగా ఉరుసు ఉత్సవాలు మూడు రోజుల పాటు జరుపుతారు. సద్గురు హజరత్ దర్బార్ వలీ అలీషా వలీ, రహంతుల్లా అలైహి బాబా, శ్రీ జలీల్ మస్తాన్‌వలీ గార్ల ఉరుసు ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కనుల పండువగా జరుగుతాయి. అత్యంత మహత్యం కలిగిన ఈ ప్రదేశం శివత్వమని, శివైక్యం పొందిన దర్బారు నగరు పీఠాధిపతి గురువు సద్గురు దర్గాస్వామీజీ తెలిపారు. దత్త పీఠానికి చెందిన మహాపూర్ణత్వ పురుషులైన హజరత్ దర్బారు అలీషావలీ 147 వ సంవత్సరంలో ఈ నిర్జన స్థలంలో సజీవ సమాధిగా సిద్ధి పొందారని స్వామీజీ వివరించారు. అప్పటి అరేబియా దేశస్తులైన హజరత్ దర్బారు షావలి తన భారత దేశ యాత్ర సందర్భంగా ఈ నిర్జన ప్రదేశ విశేష మహత్యానికి తపోసిద్ధి పొంది ఇక్కడ సమాధి పొందారు.

దర్గా దర్బారులో సాయి మందిరం, విద్యాలయం..

ఇదే ఆశ్రమ సన్నిధిలోనే షిర్డీ సాయినాథుని పంచలోహ విరాట్ విగ్రహంతో కూడిన మందిరం నిర్మించారు. అలాగే పంచలోహ ఉత్సవ విగ్రహం కూడా ఉంది. అలాగే 1–10వ తరగతి వరకు సుందరమైన భవనాలలో తరగతి గదులు, ప్రార్థనా మందిరం ఇక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులందరికీ ఒక పూట ఉచిత భోజనంతో కూడిన విద్యాదానం చేస్తున్నారు.

మాతాజీ మందిరం..

స్వామీజీకి అహర్నిశలు చేదోడువాదోడుగా ఉండి అంతా తానై వచ్చే భక్తులను ఎంతో ఆప్యాయత అనురాగాలతో ప్రేమగా పలకరించే ఆయన అర్ధాంగి రంగనాయకమ్మ తుదిశ్వాస వదిలారు. అక్కడికి వచ్చే భక్తులందరూ అమ్మ అంటూ మాతృమూర్తి సమాధి దర్గాలో ఏర్పాటు చేసి నిత్యం ఆరాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఉరుసు ఉత్సవం..

సద్గురు హజరత్ దర్బార్ అలీషావలి, రహంతుల్లా అలైబాబా జలీల్ మస్తాన్ వలీ బాబా గార్ల ఉరుసు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు గంధమహోత్సవం, 14న శుక్రవారం జెండా మెరవణి , ఉరుసు, రాత్రి హిందూ, మహమ్మదీయ సోదరుల సహకారంతో బ్రహ్మాండమైన వాయిద్యాల నడుమ బెంగళూరుకు చెందిన అస్మా నిఖత్, నాగపూర్‌కు చెందిన సలీం సైదాలతో గొప్ప ఖవాలీ పోటీ ఉంటుంది. 15న తహలీల్ ప్రసాదం అందించడంతో ఉత్సవం ముగుస్తుంది.

సంరక్షణ కేంద్రానికి చిన్నారి అప్పగింత


రాయచోటి సంరక్షణ కేంద్రంలోని సిబ్బందికి పాపను అప్పగిస్తున్న సూపర్‌వైజర్

ములకలచెరువు : మండల కేంద్రంలో లభ్యమైన ఆడ శిశువును రాయచోటి శిశు సంరక్షణ కేంద్రానికి అప్పగించామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల బుధవారం తెలిపారు. చిన్నారికి మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. అక్కడి నుంచి రాయచోటికి ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లి కేంద్రంలోని సంరక్షకులకు అప్పగించామన్నారు. పాప ఆరోగ్యంగా ఉన్నట్లు వివరించారు.

సంబంధీకులు సంప్రదించాలి

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా ములకలచెరువు ఉమాశంకర్‌కాలనీ ఆదర్శ పాఠశాల వద్ద గుట్టలో బ్యాగులో ఓ చిన్నారిని గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లినట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారిణి పి.రమాదేవి తెలిపారు. బుధవారం ఆమె రాయచోటిలో మాట్లాడుతూ 3 నుంచి 5 రోజుల ఆడ శిశువును ములకలచెరువు ఆదర్శ పాఠశాల వద్ద వదిలి వెళ్లిపోయారన్నారు. విషయం తెలుసుకున్న పోలీసు, ఐసీడీఎస్ అధికారులు చిన్నారిని శిశుగృహంలో ఉంచారన్నారు. తల్లిదండ్రులు, సంబంధీకులు పాపను గుర్తించేందుకు తగిన ఆధారాలతో 30 రోజుల్లోగా అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి వారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. లేని పక్షంలో ఈ పాపను అనాథగా ప్రకటించి, ప్రభుత్వ షరతులు, నియమాల ప్రకారం మరొకరికి దత్తత ఇస్తామని ఆమె వివరించారు.

క్రమశిక్షణ, సేవాభావానికి ప్రతీక స్కౌట్

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు


స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి అర్బన్ : విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవాభావాలను పెంపొందించేందుకు బాలభటుల ఉద్యమం (స్కౌట్ అండ్ గైడ్స్) తోడ్పడుతుందని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. బుధవారం పట్టణంలోని అర్చన కళాశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు నిర్వహిస్తున్న పెట్రోల్ లీడర్ శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం మధ్యాహ్నం ఆయన సందర్శించారు. గార్డ్ ఆఫ్ హానర్‌తో స్కౌట్ విద్యార్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ స్కౌట్‌అండ్ గైడ్స్ శిక్షణ పొందిన విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు బంగారు భవిష్యత్తు సమకూరుతుందన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ద్వారా వారు ప్రపంచ స్థాయి పౌరులుగా ఎదిగేందుకు స్కౌట్ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నా రు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు, మానవతా విలువలు పెంపొందుతాయని చెప్పారు. విద్యార్థి దశనుంచే తల్లిదండ్రులు, గురువులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా మెలిగేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న స్కౌట్‌మాస్టర్‌లు, గైడ్ కెప్టెన్‌లకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, ఏఎస్‌ఓసీ లక్ష్మీకర్, హెచ్‌డబ్ల్యు నిర్మల, స్కౌట్ మాస్టర్‌లు ఓబుళరెడ్డి, నాగరాజు, గైడ్ కెప్టెన్‌లు సుజాత, గోవిందమ్మ, స్వర్ణలతతో పాటు స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం


వైభవంగా సాగిన స్వామివారి రథోత్సవం

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన బుధవారం ఉదయాన్నే రథారోహణం నిర్వహించారు. ఆలయంలోని స్వామివార్లను స్థానిక బస్టాండు కూడలిలోని స్వామివారి తేరు(రథం) వద్దకు తీసుకొచ్చి అందులో కొలువుదీర్చారు. ఆలయంలో ధూళీ ఉత్సవం నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివారి రథాన్ని అందంగా అలంకరించారు. అనంతరం హరినామస్మరణ, గోవింద సంకీర్తనలు నడుమ రథోత్సవం సాగింది. స్వామివారి రథోత్సవానికి అడుగడుగునా ప్రజలు, భక్తులు స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు గ్రామానికి చేరుకొని గోవిందా, గోవిందా అంటూ భక్తి తన్మయత్వంతో స్వామివారి రథాన్ని లాగారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని పలు కార్యక్రమాలు చేపట్టారు. పలువురు అన్నదానం నిర్వహించారు. మేళతాళాలు, కోలాటాలు, టీటీడీ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలతో రథోత్సవం పురవీధుల గుండా వైభవంగా సాగింది. మంగళవారం రాత్రి స్వామివారి తిరునాల ఘనంగా నిర్వహించారు. తరిగొండతో పాటు పరిసర గ్రామాల ప్రజలు చాందినీ బండ్లు, అన్నం, టెంకాయ బండ్లు ఆలయం చుట్టూ తిప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయంలో నేడు..

మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజైన గురువారం సూర్యప్రభ వాహనం, ఊంజల్‌సేవ, చంద్రప్రభ వాహనం, పార్వేట ఉత్సవం, అశ్వవాహనం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు గోపాల బట్టార్ తెలిపారు.

నిధుల ఖర్చుపై విచారణ

వీరబల్లి : వంగిమల్ల పంచాయతీలోని గ్రామాలలో తాగునీటికోసం ఖర్చుచేసిన నిధులపై బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. క్వాలిటీ కంట్రోల్ డీఈఈ జాకప్ పాల్, అసిస్టెంట్ ఇంజినీర్ విశ్వనాథన్‌లు ఈ విచారణ జరిపారు. 14, 15వ ఫైనాన్స్ నిధులతో ఖర్చుచేసిన పనులను, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గతంలో పనిచేసిన ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కృష్ణయ్య, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, స్థానిక గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ భక్తవత్సలం

సంబేపల్లె : హత్య కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని నారాయణరెడ్డి గ్రామంలో ఇటీవల వారాధి అనే వ్యక్తి హత్యకు గురయ్యాడన్నారు. పోలీసులు విచారణ చేపట్టడంతో వాస్తవాలు బయటి వచ్చాయని తెలిపారు. అదే గ్రామానికి చెందిన చిన్నికృష్ణ, ఆనంద్‌రెడ్డిలు ఓ కాంట్రాక్ట్ పని విషయమై వారాధితో గొడవపడ్డారన్నారు. దీంతో పథకం ప్రకారం వారాధి నిద్రిస్తున్న సమయంలో బండరాయితో కొట్టి చంపినట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం


లారీలో ఇటాచ్ యంత్రాన్ని తీసుకెళుతున్న దృశ్యం

సిద్దవటం : మాచుపల్లె– కడప రహదారి బండికనుమ సమీపంలో లింగంపల్లె గ్రామం నుంచి కడప వైపు బుధవారం లారీలో ఇటాచ్ యంత్రాన్ని తీసుకెళుతుండగా విద్యుత్ వైర్లు తెగి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వివిధ పనులపై జిల్లా కేంద్రానికి ఆ రహదారిపై ప్రయాణిస్తుంటారు. విద్యుత్ వైర్లు తెగిపడి, విద్యుత్ స్తంభం ఒరిగి, మామిడి చెట్టు రోడ్డుకు అడ్డంగా పడటంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ విషయమై సిద్దవటం ట్రాన్స్‌కో ఏఈ జయచంద్రను వివరణ కోరగా లింగంపల్లె గ్రామం నుంచి లారీలో ఇటాచ్ యంత్రాన్ని కడపకు తీసుకెళుతుండగా విద్యుత్ వైర్లు తగులుకొని తెగిపోయాయన్నారు.ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని లారీ యజమానిపై కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

ధర్మాన్ని రక్షిస్తూ ఉండాలి


అనుగ్రహభాషణం చేస్తున్న పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతిస్వామి

మదనపల్లె సిటీ : ధర్మాని రక్షిస్తూ ఉండాలని జగద్గురు పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి అన్నారు. మదనపల్లె మండలం చిప్పిలిలోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం అఖిల బ్రాహ్మణ సేవా సమాఖ్య సహకారంతో నూతనంగా నిర్మించిన సత్యదేవ సదన్ భవన్‌ను ప్రారంభించారు. ఆలయంలో భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. ధర్మాన్ని వదిలివేస్తే లక్ష్మిదేవి నిన్ను వదిలివేస్తుందన్నారు. అయిదు గుణాలు ఉన్నవారిని లక్ష్మి వరిస్తుందన్నారు. ప్రతి నిత్యం కర్మలను ఆచరిస్తూ ఉండాలన్నారు. ఫలకాంక్ష లేని కర్మలను ఆచరించాలన్నారు. ఉదయం ఆలయంలో గోపూజ, గణపతి పూజ, వాస్తుపూజ, హోమం, వాస్తుబలి నిర్వహించారు. ఆలయం ఆవరణంలో సత్యదేవుని వ్రతం కనుల పండువగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అమరనాథ్, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి దివాకర్, కో ఆర్డినేటర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం

జేసీ ఆదర్శ రాజేంద్రన్


తట్టివారిపల్లె హైవే వద్ద భూనిర్వాసితులతో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

మదనపల్లె : హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించేందుకు కృషి చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. బుధవారం మండలంలోని తట్టివారిపల్లె వద్ద నేషనల్ హైవే భూసేకరణకు సంబంధించి నిర్వాసితులతో మాట్లాడారు. హైవే నిర్మాణానికి సహకరించాల్సిందిగా కోరారు. తర్వాత పోతబోలు పంచాయతీలో ఎంబీజీ లేఅవుట్ కోసం రెవెన్యూ అధికారులు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక అందించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పీకేఎం–ఉడా కార్యాలయంలో చైర్‌పర్సన్ హోదాలో కార్యకలాపాలపై సమీక్షించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ ధనంజయులు, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, పీకేఎం–ఉడా సిబ్బంది మధు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో – నీళ్ల ట్యాంకర్ ఢీ

రాయచోటి టౌన్ : రాయచోటి – రాజంపేట రోడ్డులోని బండ్లోళ్లపల్లెమిట్ట సమీపంలోని మలుపు వద్ద ప్రయాణికుల ఆటో, నీళ్ల ట్యాంకర్ ఢీ కొన్న సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామం తురుకపల్లెకు చెందిన వ్యవసాయ కూలీలు ఆటోను బాడుగకు తీసుకొని ఓదివీడు సమీపంలో టమాటా తోటలలో కూలి పనులు చేసేందుకు బయలు దేరారు. బండ్లోళ్లపల్లె మిట్ట సమీపానికి రాగానే అక్కడ మలుపు వద్ద రోడ్డు మీదకు వస్తున్న నీళ్ల ట్యాంకర్ ఒక్కసారిగా ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు అందరూ రోడ్డుపై పడ్డారు. వీరిలో సయ్యద్ హుస్సేన్ బీ, సయ్యద్ హుస్సేన్, సయ్యద్ ఖాదర్ బీ, సయ్యద్ ఫాతిమాలతో పాటు మరో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిని 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో తీవ్రంగా గాయపడిన నలుగురిని మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు.

స్పందించిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి

ఈ ప్రమాదం జరిగిన కొద్ది సేపటికే రాయచోటిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన యువత పోరులో పాల్గొనేందుకు రాజంపేట నుంచి వస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆ సంఘటనను చూసి ఆగారు. కార్యకర్తల సాయంతో క్షతగాత్రులను పైకి లేపి అక్కడినుంచే పోలీసులకు ఫోన్ చేయడంతో పాటు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి వీరికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కూడా క్షతగ్రాలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఫోన్ ద్వారా సూచించారు. తెలుగు దేశం పార్టీ నాయకుడు మార్యా రెడ్డి రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.


సంఘటన స్థలం నుంచే అధికారులకు సమాచారం తెలియజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

కర్ణాటక సరిహద్దులో
రెండు ప్రైవేట్ బస్సులు ఢీ


ఎదురెదురుగా ఢీకొన్న రెండు ప్రైవేట్ బస్సులు

- ఒకరి మృతి, ఏడుగురికి తీవ్రగాయాలు
- నలుగురి పరిస్థితి విషమం
- 40మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు


ప్రమాద ఘటనలో గాయపడినవారు


గంగాధర్ (ఫైల్ ఫొటో)

మదనపల్లె : కరకర్ణాటక రాష్ట్ర సరిహద్దు, మదనపల్లెకు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఏడుగురికి తీవ్రగాయాలతో పాటు 40 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నుంచి బెంగళూరుకు వెళుతున్న సువర్ణముఖి(సబర్వాల్) ప్రైవేట్ బస్సు మదనపల్లె మీదుగా బెంగళూరుకు వెళుతోంది. అదే సమయంలో బెంగళూరు నుంచి నంద్యాలకు వెళుతున్న ఏఆర్‌బీసీవీఆర్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్ణాటక సరిహద్దు రాయల్పాడు సమీపంలోని గెలిజగూరు వద్ద రాత్రి 1 గంట సమయంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఏఆర్ ట్రావెల్స్ బస్సు ముందు వైపు వెళుతున్న వాహనాలను ఓవర్‌టేక్ చేస్తూ, ఎదురుగా వచ్చిన సువర్ణముఖి బస్సును ఢీకొంది. ప్రమాదంలో మదనపల్లె కమ్మవీధికి చెందిన సువర్ణముఖి ప్రైవేట్ బస్సు కండక్టర్ గంగాధర్ అలియాస్ బాబు (59) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. డ్రైవర్ వెనుక సీటులో ఉన్న మరో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీనివాసపురం ఆస్పత్రికి తరలించారు. 22 మంది ప్రయాణికులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారిలో చింతామణికి చెందిన వెంకటేష్ (40), కడపకు చెందిన అలీ(38), నంద్యాలకు చెందిన జవహరుద్దీన్(35), బెంగళూరుకు చెందిన జయకుమారి(30), ఆనందరెడ్డి(54), రాంప్రసాద్(57), రాయచోటికి చెందిన నిర్మల(38) తీవ్రంగా గాయపడగా, మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతి, బెంగళూరు ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న కర్ణాటక రాయల్పాడు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని క్షతగాత్రులను మదనపల్లె, బెంగళూరు, కోలారు, శ్రీనివాసపురం ఆస్పత్రులకు 108 వాహనాల్లో తరలించారు. ప్రమాదఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాలిపోయిన గుర్రంకొండ


సగం వరకు కాలిపోయిన గుర్రంకొండ కొండ

గుర్రంకొండ : చరిత్రాత్మక గుర్రంకొండ కొండ కాలిబూడిదైంది. ఈ కొండలోనే చరిత్రాత్మక కట్టడాలతో పాటు పురాతన భవనాలు, కోటగోడలు ఉన్నాయి. సుమారు 500 ఎకరాల్లో గుర్రంకొండ కొండ విస్తరించి ఉంది. గత రాత్రి గుర్తుతెలియని దుండుగులు కొండకు వెనుకవైపు నిప్పు అంటించారు. దీంతో కొండలు సగానికిపైగా కాలిబూడిదయ్యాయి. కొండ ముందు భాగంలో ఉన్న కోటగోడలు, కొండపైభాగం వరకు మంటలు వ్యాపించాయి. దీంతో చెట్లు మొత్తం కాలిపోయాయి. మంటల్లో చిక్కుకొని అడవి జంతువులు, పక్షులు, అగ్నికి ఆహుతి అయ్యాయి. గత కొన్ని రోజులుగా దుండుగులు కొండలు, గుట్టలకు నిప్పు పెడుతున్నారు.